మూడు లాంతర్ల సెంటరే దేవీచౌక్

- 92 ఏళ్లుగా దేవీచౌక్‌లో వైభవంగా దసరా ఉత్సవాలు
- ఇక్కడి వేదికపై నటించాలని కళాకారుల ఉత్సుకత
- గతంలో నాటక ప్రదర్శలను తిలకించిన ప్రసిద్ధ సినీతారలు



విద్యుత్ దీపాలంకరణలో రాజమహేంద్రవరం దేవీచౌక్ సెంటర్ (ఫైల్)

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఊరూవాడ ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఆలయాలు, మండపాల కమిటీల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి వైభవంగా పూజలు నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరంలో దేవీచౌక్ సెంటర్‌లో బాలాత్రిపుర సుందరి దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం రాత్రి 9.45 గంటల నుంచి వైభవంగా ప్రారంభమై అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజులపాటు కొనసాగనున్నాయి.

1934 ప్రారంభమైన వేడుకలు

బత్తుల కామరాజు, బత్తుల మునియ్య రాజమహేంద్రవరం నగరం నుంచి కోల్‌కతాకు చింతపండు వ్యాపారం నిమిత్తం తరుచూ వెళ్లి వస్తుండేవారు. దసరా సమయంలో కోల్‌కతాలో దేవీ నవరాత్ర ఉత్సవాల నిర్వహణను చూసి వారు ఆశ్చర్యపోయారు. దేదీప్యమానంగా అమ్మవారి ఉత్సవాలను రాజమహేంద్రవరంలో నిర్వహించాలని వారు నిశ్చయించుకున్నారు. 1934లో రాజమహేంద్రవరం నగరంలోని మూడు లాంతర్లు సెంటర్‌లో అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించారు. 1960లో అమ్మవారి పాలరాతి విగ్రహాన్ని అప్పటి మున్సిపల్ చైర్మన్ నిడమర్తి వెంకటనరసింహారావు ఆధ్వర్యంలో మూడు లాంతర్లు సెంటర్‌లో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆ సెంటర్ దేవీచౌక్ సెంటర్‌గా ప్రశిద్ధికెక్కింది.



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం (ఫైల్)

రాజమహేంద్రవరం దేవీచౌక్ సెంటర్‌లో దసరా ఉత్సవాల్లో ప్రదర్శించే నాటకాలకు విశేష స్పందన ఉండేది. దేవీ నవరాత్రులు సందర్భంగా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన నాటక ప్రదర్శనలను తిలకించేందుకు జనం తండోపతండాలుగా దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చేవారు. రాత్రి ప్రదర్శించే నాటకాన్ని తిలకించడానికి జనంతో పాటు సినీ తారలు హాజరై కళాకారులను ప్రోత్సహించేవారు. ఇక్కడి ఏర్పాటు చేసి భారీ సెట్టింగులు, విద్యుద్దీపాలంకరణ ప్రజలను ఆకట్టుకుంటుంది. ఉత్సవాల సమయంలో ఇక్కడ నాలుగు కూడళ్లలో ఎటు చూసినా కోలాహలంగా, సందడిగా ఉంటుంది. 92 ఏళ్ల నుంచి ఇక్కడ బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారి శరన్నవరాత్రులు ఉత్సవాలను కమిటీ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నాటకాల ప్రదర్శనకు ప్రసిద్ధి

దేవీచౌక్‌లో దసరా ఉత్సవాల్లో నాటకాల ప్రదర్శనకు రాష్ట్ర వ్యాప్తంగా పేరొందింది. ఒక్కసారైనా ఇక్కడి వేదికపై నటించాలని ప్రతి కళాకారుడు ఉవిళ్లూరేవారు. అనేక నాటకాల్లో ప్రసిద్ధి రంగస్థలం నటులు నటించారు. సురభి వారి నాటక ప్రదర్శనలు ప్రజలను అలరించేవి. ఇక్కడ ప్రదర్శించే నాటకాలలో ప్రముఖ రంగస్థల కళాకారులు షణ్ముక అంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి, సూరవరపు వెంకటేశర్లు, కాగితం సుబ్బారావు, లక్షణరావు, సీఎస్ఆర్ అంజనేయులు, ద్వారంపూడి సూర్యారావు వంటి దిగ్గజాలు తమ ప్రతిభను ప్రదర్శించారు.

దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సినీ ప్రముఖులు

ఎస్వీ రంగరావు, అక్కినేని నాగేశ్వరరావు, సీఎస్సార్ అంజనేయులు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, ప్రభాకర్‌రెడ్డి, రేలంగి, అంజలీదేవి, ఆదినారాయణరావు, సత్యనారాయణ, జి.వరలక్ష్మి, సావిత్రి, జెమినీ గణేషన్, కృష్ణ, శారద, చలం, గీతాంజలి, రాజబాబు వంటి తదితర తెలుగు తారలే కాకుండా సునీల్ దత్ వంటి హిందీ నటులు కూడా ఇక్కడి నాటకాలను తిలకించారు.భక్త చింతామణి నాటకంలో సుబ్బిశెట్టిగా పద్మనాభం, బాలనాగమ్మలో మాయల ఫకీరుగా రాజనాల నటించి అలరించారు. రాజసులోచన ఇక్కడి వేదికపై నాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

అమ్మవారికి విశేష పూజలు



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలి వస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి రోజు ఉదయం నుంచి కుంకుమ పూజలు, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తాం. ప్రసిద్ధి చెందిన నాటకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశాం.

– బత్తుల రాజరాజేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

దేశానికి సేవ చేసేందుకు నేవీలో చేరండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కమాండర్ కౌశిక్

కంబాలచెరువు: స్థానిక జేఎన్.రోడ్డుని సూర్య ఫంక్షన్‌లో 9,10 విద్యార్థులకు నేవీ కమాండర్ కేవీఎస్.కౌశిక్ శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005లో గౌతమీ స్కూళ్లో 10వ తరగతి పాసయ్యాయని, 20 సంవత్సరాల తర్వాత ఇటువంటి అవకాశం వస్తుందని ఊహించలేదన్నారు. స్కూలు జీవితం చాలా ఆనందంగా సాగిందని, నేవీలో క్రమశిక్షణగా ఉండడం ముఖ్య విధి అన్నారు. ప్రతీ ఏడాది డిసెంబర్ 4వ తేదీన నేవీ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. కష్టపడకపోతే ఏమీ సంపాదించలేమని, నేవీ యూనిఫాం కుటుంబానికి అండగా నిలుస్తుందని, ఎంతో గౌరవిస్తుందన్నారు. దేశానికి సేవచేయడానికి నేవీని ఎంచుకున్నానన్నారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ సుంకర రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

కడియం: దుళ్ల శివాలయం వీధిలోని లక్ష్మీగణపతి స్వామి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్థానిక యువత, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు

కడియం: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసాయని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించినందుకు ఉత్సవ కమిటీలను ఆయన అభినందించారు.

కనీస వేతనాలు చెల్లించాలి

సీటీఆర్ఐ: వీఆర్ఏలకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తూర్పుగోదావరి జిల్లా వీఆర్ఏలు ధర్నా చేపట్టారు.ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు మల్లిమొగ్గల వెంకటరమణ మాట్లాడుతూ వీఆర్ఏల ప్రధాన సమస్యల్లో ఒకటైన పే స్కేల్ అమలు చేయాలని అన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. కారుణ్య నియామకాల చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ప్రెసిడెంట్ కె రాజేంద్రప్రసాద్, అనపర్తి అధ్యక్షుడు దండకడియాల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాలీ సుబ్బారావు, రంగంపేట మండలం అధ్యక్షుడు ఐ.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్లో ఇంటర్నేషనల్ సేవ్ గర్ల్స్ చైల్డ్ డే పురస్కరించుకుని శనివారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని వివిధ హైస్కూల్ బాలిక విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి.కోమల, జిల్లా ఇన్‌స్పెక్షన్ అధికారి దిలీప్‌కుమార్, స్కూలు హెచ్‌ఎం మల్లేశ్వరరావు, సత్యకుమార్, శ్రీనివాస్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

రాజమహేంద్రవరం రూరల్: హౌసింగ్ లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాతి బుజ్జి ఆదేశించారు. శనివారం తొర్రేడులో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం, హౌసింగ్ డే సందర్భంగా ఆమె మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్‌తో కలిసి మొక్కలు నాటారు. హౌసింగ్ ఏఈ శ్రీకాంత్,ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దామెర్ల ఆర్ట్ గ్యాలరీ సందర్శన



ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తున్న విద్యార్థులు

సీటీఆర్ఐ: ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు గీసిన చిత్రాలు ప్రకృతికి దగ్గరగా ఉంటాయని, ఎంతో సహజంగా కనిపిస్తాయని విజయ శంకర ప్రభుత్వ నృత్య సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస శర్మ కొనియాడారు. శనివారం స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో వికసిత్ భారత్-2047, సేవా పర్వం-2025 లో భాగంగా నాలుగవ రోజు స్థానిక దామెర్ల ఆర్ట్ గ్యాలరీని విద్యార్థినీ, విద్యార్థులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది సందర్శించారు.

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టండి



అధికారులతో సమావేశమైన కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం సిటీ: ప్రాధాన్యత క్రమంలో నగరంలో అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలిచ్చారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాధిపతులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులపై ఆరా తీశారు. మొదటి దశలో చేపట్టిన 15 రహదారుల విస్తరణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా ముంపునకు గురవుతున్న ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు వీధుల్లో నీరు నిలిచిపోకుండా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లోని తాగునీటి పైపులైన్లు ఉంటే వాటిని మార్చాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ (ఇన్‌చార్జి) రీటా, ఎంహెచ్ఓ వినూత్న, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఈఈలు మాధవి, మదర్సా అలీ, అకౌంటెంట్ నాగమణి, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ విధానంతో ఇబ్బందులు



పిడింగొయ్యి సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

రాజమహేంద్రవరం రూరల్: రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ విధానంలో ఓటీపీ, ఆటోమ్యుటేషన్ వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పిడింగొయ్యి దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పోతల శ్రీనివాసరావు, ఎస్. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం పిడింగొయ్యి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు రెండవరోజు పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు వీఎస్ఎన్.ఫణి,కోశాధికారి కందుకూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ది రాజమండ్రి దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం రెండవరోజు పెన్‌డౌన్ కార్యక్రమంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రెడ్డి, రాజమహేంద్రవరం సంఘ అధ్యక్షుడు కోలా రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ కార్యదర్శి బేరి సూర్యనారాయణ రెడ్డి, దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు. రెండురోజుల పాటు దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ నిర్వహించడం వలన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

పద్మ విభూషణ్ అక్కినేనికి ఘన నివాళి



అక్కినేని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర, మిత్ర బృందం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్) : అక్కినేని నాగేశ్వరరావుతో నటించడమే కాకుండా తన ఆర్కెస్ట్రా ద్వారా ఆయనను సత్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నారని నటగాయకులు జిత్‌మోహన్‌మిత్ర అన్నారు. శనివారం స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో మిత్రబృందం ఆధ్వర్యంలో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మ విభూషణ్ అక్కినేని నాగేశ్వరరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడుతూ రాజమహేంద్రవరం అక్కినేని నాగేశ్వరరావు కాంస్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. తూర్పుగోదావరి జిల్లా అక్కినేని అభిమాన సంఘం అధ్యక్షుడు ఏఎస్ ఆనంద్ మాట్లాడుతూ అక్కినేని జీవితం ఆదర్శనీయమని తెలిపారు.మన అక్కినేని పుస్తకాన్ని తాళం మణిధర్ ఆవిష్కరించారు. బి.సీ తారామారావు, డా. గిరజాల సోమరాజు నాయుడు, గుంటూరి శ్రీనివాస్, కృష్ణ, సలీమ్, రాము, కృష్ణయ్య పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న అడపా శ్రీహరి



మాట్లాడుతున్న శ్రీ సువర్ణ వర్తక సంఘం అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: అడపా శ్రీహరి అధ్యక్షుడిగా ఉన్న సువర్ణ వర్తక సంఘం ఫేక్ వర్తక సంఘమని, శ్రీహరి డబుల్ 420 అని శ్రీ సువర్ణ వర్తక సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో శనివారం నల్లమందు సందులోని రాజేశ్వరి జ్యువెల్లరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎన్నికల్లో గెలిచి అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని కడియాల శ్రీనివాస్ అన్నారు. శ్రీహరి స్వయంప్రకటిత అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడని ధ్వజమెత్తారు. అధికార పార్టీ నేతలతో కలసి శ్రీహరి అవినీతికి, అవకతవకలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. సువర్ణవర్తక సంఘంలోకి ఆయన కులాన్ని, పార్టీలను తీసుకువచ్చారని మండిపడ్డారు. సువర్ణ వర్తక సంఘం సభ్యులకు బంగారం క్రయ విక్రయాల్లో ఏదైనా ఇబందులు వస్తే అడపా హరి పరిష్కరించలేదని అన్నారు. సంఘాన్ని తాను ముందుకు నడిపిస్తానని కడియాల శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కడియాల వరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలి



బొమ్మూరులో రిలే నిరాహారదీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: దీర్ఘకాలిక సర్వీసు కల్గిన కాంట్రాక్టు ఉద్యోగులను విద్యుత్ సంస్థలో విలీనం చేసి న్యాయం చేయాలని ఏపీ ట్రాన్స్‌కో జేఏసీ చైర్మన్ జగతా అచ్యుతరామయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర పవర్ జేఏసీ పిలుపుమేరకు బొమ్మూరులోని 220 కేవీ సబ్‌స్టేషన్ ఏపీట్రాన్స్‌కో ఓఅండ్ఎం సర్కిల్ వద్ద విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల రిలే నిరహారదీక్ష ఆయన ఆధ్వర్యంలో శనివారం రెండవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అచ్యుతరామయ్య మాట్లాడుతూ పాత విధానంలోనే కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. జేఏసీ కన్వీనర్ పి.రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ఓఅండ్ఎం ఉద్యోగులను జూనియర్ సహాయకులు, సబ్‌ఇంజినీర్లుగా నియమించాలన్నారు. జేఏసీ కోశాధికారి విజయశ్యామల మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు. ముందుగా కార్మికులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘ నాయకులు డేవిడ్‌రాజు, విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణాన్ని సంరక్షించాలి

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రీన్ ఆంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ మన రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. దీనికి విద్యార్థులు, పౌరులు అందరూ టెరస్ గార్డెనింగ్, హోమ్ కంపోస్టింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ఆర్. శ్రీనివాస్, సాసా కోఆర్డినేటర్ జి. రవితేజ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, చంద్రశేఖర్, యూసఫ్‌భాషా పాల్గొన్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ఆర్ట్స్ కళాశాలలో గత ఆరు రోజులుగా జరుగుతున్న రేర్ ఎర్త్ అండ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్రిటికల్ మినరల్స్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా ఏపీసీటీ అధికారులు, సీతంస్ డైరెక్టర్ మజ్జి శశిభూషణ్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర హాజరయ్యారు. ఆరు రోజుల అధ్యాపకుల శిక్షణా కార్యక్రమంలో వివిధ పరిశోధన అంశాలు, ఆవిష్కరణలో సమస్యల పరిష్కారాలపై నిపుణులతో చర్చించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం చేస్తున్నట్లు దీనిలో భాగంగా రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ ఏక్షన్ కమిటీ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరావు పేర్కొన్నారు. శనివారం ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఉద్యోగుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ ఏక్షన్ కమిటీ, రాష్ట్ర, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ ఆదేశానుసారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ చైర్మన్ ఎం.శ్రీనివాసు, డివిజన్ కన్వీనర్ కె. శ్రీనివాసు హాజరయ్యారు.

మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరించాలి



జేమ్స్‌వాట్ కొమ్ము

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గోదావరి నది మధ్యలో సినిమా తీయాలని ఉందని రాజమండ్రి నగరానికి చెందిన వీరచంద్రహాస సినిమా ప్రొడ్యూసర్ డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము అన్నారు. వీర చంద్రహాస చిత్రం శనివారం శివజ్యోతి థియేటర్‌లో మ్యాట్నీ షో మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జేమ్స్ వాట్ కొమ్ము మీడియాతో మాట్లాడుతూ చిత్ర పరిశ్రమలో 2018 నుంచి ఉన్నట్టు తెలిపారు. మొదటి చిత్రం నువ్వు తోపురా, రెండవ చిత్రం వాయిస్ ఆఫ్ మరియా, మూడవ చిత్రం కిల్లర్ ఆర్టిస్ట్ సినిమాలు తీసినట్లు వివరించారు. వీరచంద్రహాస నాల్గవ చిత్రమన్నారు. మంచి కథాంశంతో తీసిన చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. కన్నడ పరిశ్రమలో 100 రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడిన ఈ చిత్రాన్ని తెలుగులోకి అనువదించి విడుదల చేస్తున్నట్టు తెలిపారు. సలార్, కేజీఎఫ్ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన రవి బసూర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారని తెలిపారు. సామాజిక అంశాలతో పాటు, కమర్షియల్ చిత్రాలను నిర్మిస్తానని జేమ్స్ వాట్ కొమ్ము తెలిపారు.

మహిళలకు వైద్య పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ అన్నారు. శనివారం పిడింగొయ్యి-4 ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో స్వస్థ నారీ- సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ 35 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ రూప, ఏఎన్ఎం భవానీ, సచివాలయ ఉద్యోగులు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణను విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: ఓట్ చోర్-గద్దే చోడ్ నినాదంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. నగరంలో డీసీసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా నుంచి లక్ష సంతకాలు సేకరించాలని కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఎన్నికల కమీషన్ చేస్తున్న అవకతవకలపై ప్రజల మద్దతు కూడబెట్టేందుకు సంతకాల సేకరణ చేస్తున్నామని వివరించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ సహకారంతో లక్ష సంతకాలు సేకరించి రాహుల్ ఉద్యమంలో ప్రజల్ని భాగస్వాములుగా చేస్తామన్నారు.

ఆర్టీఐ చట్టంపై 15న అవగాహన సదస్సు



కలెక్టర్ కీర్తి చేకూరిని ఆహ్వానిస్తున్న జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: సమాచార హక్కు చట్టం 2005పై అక్టోబరు 15న తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో జై ఆంధ్ర సమాచార హక్కు సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శివన్నారాయణ, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు తుపాకుల వెంకన్న బాబు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ కీర్తి చేకూరిని ఆహ్వానించినట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, జిల్లా సంఘాన్ని పటిష్టం చేసే లక్ష్యంతో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.కిరణ్‌కుమార్‌ను, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.రూపస్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీహెచ్ సుమిత్రానందన్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.సుధాకర్, కమిటీ సభ్యులు ప్రవీణ్ పాల్గొన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ



బాలసుబ్రహ్మణ్యంకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంత తీసుకుంటున్న శాటిలైట్ సిటీకి చెందిన వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు గుబ్బల బాలసుబ్రహ్మణ్యంను శనివారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని సుబ్రహ్మణ్యంకు రూ.10వేలు ఆర్థిక సాయం చందన నాగేశ్వర్ అందించారు. మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్ బొమ్ము శ్రీను, పార్టీ నాయకులు బత్తిన అప్పారావు, మీగడ గంగాధర్, రుంకాని రవికుమార్, పుచ్చా గోవిందరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, పగడం లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



శాటిలైట్ సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

రాజమహేంద్రవరం రూరల్: రోగాలు ప్రబలకుండా బడి, ఇల్లుతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.ప్రశాంతి సూచించారు. శనివారం శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ప్రపంచ శుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ మ్యాజిక్ బస్ టీఎంవో జి.ప్రియాంక, యూత్ మెంటర్ మరియ విద్యార్థినులతో ర్యాలీ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఇన్‌చార్జి రాముడు, పీఈటీలు ఉమారాణి, వీరబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ గెద్దాడ కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక బోధనను అందిపుచ్చుకోవాలి



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ రవికుమార్, కార్యదర్శి జగన్నాథరావు

కంబాలచెరువు: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉంటూ తరగతి గదిని ఆసక్తికరంగా రూపొందించేలా కృషి చేయాలని బొమ్మూరు డైట్ లెక్చరర్, క్లస్టర్ కాంప్లెక్స్ పరిశీలకులు కె.సత్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. స్థానిక డీయంహెచ్ స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల సందర్శన సమయంలో తాను గమనించిన అంశాలు, ఉపాధ్యాయులు అనుసరించవలసిన వ్యూహాలను వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్.రవికుమార్, గెజిటెడ్ హెచ్‌ఎమ్ ఆర్.సన్యాసిరావు, క్లస్టర్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సీఆర్‌ఎమ్‌టీ జయంతి శాస్త్రి, క్లస్టర్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన పట్టణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అత్తి సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ: జనసేన పార్టీ రాజమహేంద్రవరం పట్టణ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అత్తి సత్యనారాయణ తిరిగి నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా థియేటర్లు బంద్ చేస్తామన్న వివాదం తలెత్తిన సందర్భంగా ఈ వ్యవహారంపై అత్తి సత్యనారాయణను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు.